క్లుప్తంగా

డాక్టర్ల చలో విజయవాడ



విజయవాడ ధర్నాలో పాల్గొన్న దెందులూరు, పోతునూరు, గోపన్నపాలెం పీహెచ్‌సీల డాక్టర్లు

దెందులూరు: తమ హక్కులు కాపాడుకోవడానికి రాష్ట్ర డాక్టర్ల అసోసియేషన్ ఆదేశాలకు అనుగుణంగా సమ్మె ఉధృతం చేస్తారని పీహెచ్‌సీల డాక్టర్ల అసోసియేషన్ ఏలూరు జిల్లా కార్యదర్శి పూర్ణచంద్రరావు అన్నారు. సోమవారం మండలంలోని పోతునూరు, గోపన్నపాలెం, దెందులూరు పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న డాక్టర్లు యూనియన్ ఆదేశాల మేరకు చలో విజయవాడ వెళ్లి డాక్టర్ల నిరసనలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



ఏలూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్న కొత్తపల్లి పెద్దిరాజును పరామర్శిస్తున్న కామిరెడ్డి నాని

దెందులూరు: శ్రీరామవరం వైఎస్సార్‌సీపీ నాయకులు కొత్తపల్లి పెద్దిరాజు త్వరితగతిన కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షులు కామిరెడ్డి నాని ఆకాంక్షించారు. సోమవారం దెందులూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్న పెద్దిరాజును ఆయన పరామర్శించారు. వైద్యసేవలు, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ శ్రీరామవరం గ్రామ కమిటీ అధ్యక్షుడు అక్కినేని శ్రీనివాసరావు ఉన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం ప్రసాదరావు

ఉంగుటూరు: కైకరం జిల్లా పరిషత్ హైస్కూల్లో గురజాడ జయంతిని నిర్వహించారు. దేశమును ప్రేమించు మన్న గేయాన్ని శ్రావ్యంగా ఆలపించి గురజాడ అప్పారావు జీవిత విశేషాలను హెచ్‌ఎం ప్రసాదరావు విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు గురజాడ అప్పారావు రచనలు, జీవిత విశేషాలను వివరించారు. విద్యార్థినులు దేశమును ప్రేమించుమన్నా గేయానికి నృత్య ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన , వక్తృత్వ పోటీ, గేయాలాపన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

శేషగిరిరావు మృతికి సంతాపం



సంకు శేషగిరిరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ కోటగిరి

నిడమర్రు: బువ్వనపల్లి మాజీ సర్పంచ్ సంకు శేషగిరిరావు లేని లోటు గ్రామానికి తీరనిది అని మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తండ్రి శేషగిరిరావు ఇటీవల మృతి చెందారు. సోమవారం మాజీ ఎంపీ శ్రీధర్ బువ్వనపల్లిలోని శేషగిరిరావు కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ముందుగా శేషగిరిరావు చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. మాజీ ఎంపీ వెంట భీమడోలు మండల వైఎస్సార్‌సీపీ బాధ్యులు పుప్పాల కార్తీక్, ఉప సర్పంచ్ వెల్లంకి నరేష్, వైసీపీ నేతలు సంకు కొండలరావు నాయుడు, నిమ్మల రమేష్ ఉన్నారు.

ఆశ్రమ విద్యార్థుల సమస్యలపై వినతి

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా కుక్కనూరు మండలం మాధవరం గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జేసీ ధాత్రి రెడ్డికి ఎస్ఎఫ్ఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కె.లెనిన్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ఆశ్రమ పాఠశాల హాస్టల్స్ మెరుగుపడాలంటే విద్యార్థులు తమ జీవితాలు త్యాగం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. గతంలో పోలవరం నియోజకవర్గంలో ఆశ్రమ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలుకావాలంటే విద్యార్థులు ప్రాణత్యాగాలు చేస్తేనే వచ్చేవని గుర్తు చేశారు. తక్షణం కుక్కనూరు మండలంలోని ఆశ్రమ పాఠశాల హాస్టల్స్‌లో కనీస సదుపాయాలు, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాల ఒక చోట వసతి గృహం ఇంకో చోట ఉన్నాయని చెప్పారు.

రఘురామకృష్ణరాజును వెంటనే బర్తరఫ్ చేయాలి

- అతనిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్
- క్షమాపణలు చెప్పకుంటే ఆందోళనను ఉధృతం చేస్తాం : దళిత సంఘ నేతలు



భీమడోలులో రఘురామకృష్ణరాజును అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తున్న దళిత సంఘాల నాయకులు



భీమడోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న దళిత సంఘాల నాయకులు



ఖండ్రికనర్సింహపురంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేస్తున్న అంబేద్కర్ వాదులు

భీమడోలు: కాళ్ల మండలం ఏలూరుపాడులో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ చిత్రపటం గల ఫ్లెక్సీని తొలగించి తీవ్రంగా అవమానపర్చిన ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజును వెంటనే అరెస్ట్ చేయాలని, ఆయనను ఎమ్మెల్యే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని కోరుతూ సోమవారం మాలజాతి యోధుల పోరాట సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జాతీయ రహదారి భీమడోలు జంక్షన్‌లో మండల శాఖ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. రఘురామకృష్ణరాజుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కదం తొక్కారు. ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజలందరికీ క్షమాపణలు చెప్పాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా అల్ ఇండియా దళిత నాయకులు మెండెం సంతోష్‌కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా రెండుసార్లు ఎన్నికై పార్లమెంట్, అసెంబ్లీల సాక్షిగా ప్రమాణం చేసిన రఘురామ అహంకార ధోరణిని ప్రదర్శించడం దారుణమన్నారు. అలాంటి వ్యక్తికి ప్రజలే బుద్ధిచెప్తారన్నారు. రాష్ట్ర నాయకులు ముళ్లగిరి జాన్సన్ మాట్లాడుతూ అంబేద్కర్‌ను అవమానపర్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించి సమగ్ర విచారణ చేసి ఎమ్మెల్యే పదవి నుంచి రఘురామకృష్ణరాజును బర్తరఫ్ చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే రఘురామను వెంటనే అరెస్ట్ చేయాలని భీమడోలు ఏఎస్సై చలపతిరావుకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో చైతన్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాము మాన్‌సింగ్, జిల్లా నాయకులు అంబటి నాగేంద్రప్రసాద్, నాయకులు కూరపాటి రవి, వెంపా వెంకట్రావు, కమ్మిన విల్సన్‌రాజు, కుచ్చెర్ల రాజేష్, ఓరా జయరాజు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఖండ్రికనర్సింహపురంలో నిరసన

దెందులూరు: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌ను అవమానపరిచిన ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజును వెంటనే అరెస్టు చేయాలని అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు మాండ్ర మధుబాబు, చిలకా హరీష్, సరిపల్లి మహేష్, గొలిమే హరిబాబు, భీమడోలు రామకృష్ణ, ఉండ్రాజవరపు నాగు, గొలిమే శ్రీను, చిలకా వంశీ, విష్ణు, భీమడోలు పవన్, తానిగడప సంతోష్ డిమాండ్ చేశారు. ప్రపంచంలో అన్ని దేశాల్లో భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాన్ని విదేశాల్లో పెట్టి గౌరవిస్తుంటే అహంకారంతో ఎమ్మెల్యే పదవిని అడ్డంపెట్టుకుని అంబేద్కర్‌ను ఘోరంగా అవమానపరిచిన రఘురామకృష్ణరాజు ఎమ్మెల్యే పదవి నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. దర్యాప్తు సంస్థలు ఎస్సీ కమిషన్, హైకోర్టు, మానవ హక్కుల కమిషన్ దీనిపై సుమోటోగా స్పందించకపోతే త్వరలోనే గిరిజన, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాలు రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడతామని రాష్ట్ర నాయకులు అన్నారు. రాజ్యాంగం విలువ, రాజ్యాంగం రాసిన వారి విలువ తెలియని రఘురామకృష్ణరాజు ఎమ్మెల్యే పదవిలో ఉండటం నియోజకవర్గానికి, రాష్ట్రానికి ప్రమాదకరమన్నారు. దళితులు, బీసీలు, గిరిజనులు ఆగ్రహం చవిచూడకముందే కూటమి పెద్దలు స్పందించి ఎమ్మెల్యే పదవికి రఘురామకృష్ణరాజుతో రాజీనామా చేయించాలన్నారు. దర్యాప్తు సంస్థలు అతనిపై చర్యలు తీసుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రతి మంగళ, బుధవారాల్లో 'పొలం పిలుస్తోంది'

దెందులూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మంగళ, బుధవారాల్లో జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తామని వ్యవసాయశాఖ జిల్లా అధికారి హబీబ్ బాషా అన్నారు. సోమవారం మండల వ్యవసాయశాఖాధికారి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు పొలంబాట పట్టి పొలం సాగుపై చర్చిస్తామన్నారు. మంగళవారం, బుధవారంలో ఉదయం, మధ్యాహ్నం వేళల్లో వేర్వేరు గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం పర్యటించి రైతులకు విస్తరణ సేవలు సమర్థవంతంగా నిర్వహించడం దీని ప్రధాన ఉద్దేశ్యమన్నారు. జిల్లాలో అన్ని స్థాయిల వ్యవసాయ శాఖాధికారులు, ఉద్యోగులు పొలం పిలుస్తోంది కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేయాలని రైతు సోదరులందరూ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి కోరారు.

భద్రకాళీ అమ్మవారికి అభిషేకం

ఉంగుటూరు: ఉంగుటూరులోని భద్రకాళీ అమ్మవారికి సోమవారం 11రకాలు ద్రవ్యాలతో అభిషేకాలు, మహాయాగం నిర్వహించారు. వరంగల్ భద్రకాళీ ఆలయం నుంచి వచ్చిన 9 మంది వేద పండితుల ఆధ్వర్యంలో మహాయాగం నిర్వహించారు. ఆలయ నిర్మాత డాక్టర్ పాతూరి విష్ణుప్రియరావు దంపతులు పూజల్లో పాల్గొన్నారు. భద్రకాళీ సేవా దళ చైర్మన్ పాతూరి వంశీ పర్యవేక్షణలో సభ్యులు సేవలు అందించారు. స్థానిక ఎమ్మెల్యే పి. దర్మరాజు, భక్తులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ఆగడాలలంకలో గర్భిణులకు సీమంతం చేస్తున్న దృశ్యం

భీమడోలు: పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యం పదిలంగా ఉంటుందని భీమడోలు ఎంపీపీ కనుమాల రామయ్య అన్నారు. ఆగడాలలంక గ్రామ పంచాయతీ పరిధిలో సోమ వారం ఆగడాలలంకలో పోష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ భలే రాంబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ కనుమాల రామయ్య మాట్లాడుతూ పోషక విలువలు గల సమతుల ఆహారాన్ని తినడం ద్వారా బిడ్డ, తల్లి సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారన్నారు. తద్వారా ఆరోగ్యవంతమైన సమాజ స్థాపన సాధ్యమవుతుందన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.కవిత మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆరోగ్య సూత్రాలను పాటించడం ద్వారా కుటుంబం, గ్రామం ఆరోగ్యవంతంగా ఉంటాయన్నారు. జిల్లా ప్రథమ కోఆర్డినేటర్ శ్రీనివాస్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు పోషకాహారాన్ని అందిస్తున్నామని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు జాకెట్ ముక్కలు, గాజులు, పండ్లు అందించి సీమంతం చేశారు. అనంతరం గృహ సందర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ జయమంగళ రాధాకృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు బి.శుభలక్ష్మి, జి.వెంకటలక్ష్మి, జి.జ్యోతి, జి.నాగమణి, ఎం.దైలోక, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను హరిస్తున్న లేబర్ కోడ్‌లు



పాతబస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక నేతలు

ఏలూరు (టూటౌన్): 44 కార్మిక చట్టాల స్థానంలో తెచ్చిన లేబర్ కోడ్లు కార్మిక హక్కులను హరిస్తాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.బుచ్చిబాబు విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా ఏలూరు పాతబస్టాండ్ వద్ద సోమవారం బ్లాక్ డే కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం కరోనా సమయంలో ప్రజలను ఏమార్చి కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. ఈ లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, పని గంటలు కార్మిక సంఘాలు పెట్టుకునే హక్కును ఈ లేబర్ కోడ్‌లు హరిస్తాయన్నారు. కార్మికులను బానిసలుగా మార్చి కార్పొరేట్లకు వారి శ్రమను దోచిపెట్టడమే లక్ష్యంగా ఈ లేబర్ కోడ్లను మోదీ ప్రభుత్వం తెచ్చిందన్నారు. కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య, జిల్లా కార్యదర్శి కొర్రి విజయలక్ష్మి, నాయకులు మావూరి శ్రీనివాస్, వైఎస్ కనకారావు, ఐఎఫ్‌టీయూ నాయకులు యర్ర శ్రీనివాసరావు, మంగం అప్పారావు, దూళ్ల వీరినాయుడు, కాకర్ల శ్రీను, రాచేటి శ్రీను, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆర్ శ్రీనివాస డాంగే, ఎ.అప్పలరాజు, భజంత్రీ శ్రీనివాసరావు, యు.హేమ సుందర్ తదితరులు నాయకత్వం వహించారు.

27 నుంచి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

దెందులూరు: స్వర్ణాంధ్ర ఎట్ ద రేటాఫ్ 2047పై 6వ తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసం పాఠశాల స్థాయి, మండల, జిల్లాస్థాయిలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహిస్తామని దెందులూరు ఎంఈఓ ఏబీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు వ్యాసరచన, వక్తృత్వం, డిబేట్‌లో ఈ పోటీలు నిర్వహించాలన్నారు. జిల్లా స్థాయి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇస్తారన్నారు. మొదటి బహుమతి రూ.700 విలువ గల, పుస్తకం, సర్టిఫికెట్, ద్వితీయ బహుమతిగా రూ.500 విలువ గల పుస్తకం, సర్టిఫికెట్, తృతీయ బహుమతిగా రూ.300 విలువ గల పుస్తకం, సర్టిఫికేట్ అందిస్తామన్నారు. మండలంలో విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీఆర్వోల బదిలీ

దెందులూరు: మండలంలో 12 మంది వీఆర్వోలను కలెక్టర్ కె.వెట్రిసెల్వి బదిలీ చేశారని దెందులూరు తహసీల్దార్ బి.సుమతి అన్నారు. సోమవారం మండలంలో వీఆర్వోల బదిలీల వివరాలను వెల్లడించారు. సానిగూడెం వీఆర్వో జ్యోతి పోణంగి బదిలీ అయ్యారు. గాలాయగూడెం వీఆర్వో చొదిమెళ్లకు, దెందులూరు వీఆర్వో అనిరుధ్ వెంకటాపురానికి, సీతంపేట వీఆర్వో రామచంద్రరావు పోతునూరుకు, కొవ్వలి వీఆర్వో కిషోర్ సీతంపేటకు, పోతునూరు వీఆర్వో శ్రీను దెందులూరుకు, రామారావుగూడెం వీఆర్వో సూర్యకుమారి గుండుగొలనుకు, శ్రీరామవరం వీఆర్వో, కృష్ణకుమారి ఏలూరుకు, చల్లచింతలపూడి వీఆర్వో చంద్రరావు శనివారపుపేటకు, సోమవరప్పాడు వీఆర్వో ప్రసాద్ సానిగూడెంకు, దోసపాడు వీఆర్వో సుబ్రహ్మణ్యం చల్లచింతలపూడికి, జోగన్నపాలెం వీఆర్వో రవి జోగన్నపాలెంకు బదిలీ అయ్యారు.

గురు గీతారాజ్ కర్కోరాకు అవార్డు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నాట్య కళారత్న గురు గీతారాజ్ కర్కోరాను 2024వ సంవత్సరపు కేవీఎస్ ఎక్సలెన్స్ పురస్కారానికి ఎంపిక చేశామని నగరానికి చెందిన కళారత్న కేవీ సత్యనారాయణ తెలిపారు. సోమవారం స్థానిక వైఎంహెచ్ఏ హాల్లో ఆయన మాట్లాడారు. ఈ నెల 26 స్థానిక వైఎంహెచ్ఏ హాలులో గీతారాజ్ కర్కోరాకు పురస్కారం ప్రదానం చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రికను విడుదల చేశారు.

డ్రోన్‌తో పురుగు మందుల పిచికారీ



జోగన్నపాలెంలో వరిపొలంపై డ్రోన్‌తో పురుగు మందు స్ప్రే చేస్తున్న దృశ్యం (ఇన్‌సెట్) ఆలూరి గోవిందరావు, రైతు

దెందులూరు: వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని గ్రామీణ ప్రాంతమైన జోగన్నపాలెంలో రైతు ఆలూరి గోవిందరావు వినియోగించుకుంటున్నారు. గోవిందరావుకు 15 ఎకరాల పొలం ఉంది. ఆ పొలంలో పురుగు మందులు పిచికారీ చేయడానికి 15 మంది కూలీలు, ఒక రోజు సమయం పడుతుందని రైతు అన్నారు. ఒక్కొక్కరికీ రూ.400 కూలీ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అదే డ్రోన్‌తో పిచికారీ చేయిస్తే ఎకరానికి 5 నిమిషాలలోపు పని పూర్తవుతుందన్నారు. 15 ఎకరాలు 60 నిమిషాలకే డ్రోన్ పిచికారీ చేస్తుందని తెలిపారు. డ్రోన్‌తో పిచికారీ చేయడం వల్ల ప్రధానంగా మొక్కకు పూర్తిస్థాయిలో మందు చేరుతుందని, సమయం ఆదా అవుతుందన్నారు. కూలీ ఖర్చు మాత్రం డ్రోన్‌కి, కూలీలకు దాదాపుగా సమానంగానే చెల్లించాల్సి ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతంలో మందుల పిచికారీ కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటున్న రైతు గోవిందరావును తోటి రైతులు, గ్రామస్తులు అభినందించారు.

హోటళ్లలో విజిలెన్స్ అధికారుల తనిఖీ



నారాయణపురంలోని ఓ హోటల్‌లో స్వాధీనం చేసుకున్న గ్యాస్ సిలిండర్లు

ఉంగుటూరు: చేబ్రోలు, నారాయణపురంలో పలు హోటళ్లు విజిలెన్సు అధికార్లు తనిఖీ చేశారు. రూ.52,550 విలువగల 20 గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. సోమవారం నిర్వహించిన అధికారుల సోదాల్లో నారాయణపురంలోని ఓ టిఫిన్ సెంటర్లో గృహావసరాలకు వాడే 16 సిలిండర్లను వినియోగిస్తున్నట్లు గుర్తించారు. వీటి విలువ రూ.41,850 ఉంటుందని గుర్తించారు. ఈమేరకు హోటల్ యజమాని శీలం పల్లేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు రీజనల్ విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్సుమెంటు అధికారి వి.రాంబాబు తెలిపారు. చేబ్రోలులోని ఓ హోటల్లో తనిఖీ చేసి 4 డొమిస్టిక్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని యజమాని సయ్యద్ ఖలీల్ రెహమాన్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. వీటివిలువ రూ.10,700గా గుర్తించారు. 1955 నిత్యావసర వస్తువుల చట్టం కిందపై వీరి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్సు ఇన్‌స్పెక్టర్ పి. శివరామకృష్ణ, ఎమ్మార్వో బి. కన్యాకుమారి, విజిలెన్సు ఏవో పి.సురేష్, రెవెన్యూ, పౌర సరఫరాలశాఖాధికారులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు



హైవేపై సత్యనారాయణపురం వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

దెందులూరు: జాతీయ రహదారిపై దెందులూరు మండలం సత్యనారాయణపురం వద్ద సోమవారం ఆగి ఉన్న లారీని బెంగుళూరు నుంచి రాచూరు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ తాడిచర్ల నాగరాజు, మజ్జి జగదీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కారులోని ఇద్దరూ నిద్రలేమి కారణంగా బెంగుళూరు నుంచి కారులో వస్తూ సత్యనారాయణపురం వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టారు. సమాచారం అందుకున్న దెందులూరు హెడ్‌కానిస్టేబుల్ వసంత్, హైవే పోలీసులు హుటాహుటిన అంబులెన్స్‌లో బాధితులను ఆశ్రం వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రులు ఇద్దరూ ఉంగుటూరు మండలం రాచూరు గ్రామానికి చెందిన విద్యార్థులని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఔషధ గని వేప

- పంటల రక్షణలో ముఖ్యభూమిక
- వేప ఉత్పత్తుల్లో మెండుగా ఔషధ గుణాలు
- రైతులకు తగ్గుతున్న సాగు ఖర్చులు
- సాగులో వినియోగం పెరిగితే ఆరోగ్యకరమైన ఉత్పత్తులు



వేప నూనె



వేప చెట్టు

దెందులూరు: వేప మానవాళికి ప్రకృతి ప్రసాదించిన దివ్య ఔషధం. ఈ చెట్టులోని ప్రతి భాగం ఔషధమయమే. వేప ఉత్పత్తులను పంటల సాగులో వినియోగిస్తే తెగుళ్ల తగ్గడమే కాకుండా ఆరోగ్యకరమైన ఉత్పత్తులు పొందవచ్చు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో రైతులు వేప కషాయం, రసాలను కీటకాలు, వివిధ రకాల తెగుళ్లనివారణకు పురుగు మందులకు ప్రత్యామ్నాయంగా వాడి విజయవంతమయ్యారు. దీంతో ప్రస్తుతం సాగులో ఈ చెట్టుకు ఎనలేని ప్రాముఖ్యత లభిస్తోంది. ఈ వృక్షం విరివి గా లభిస్తుండటంతో కర్షకులకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతున్నాయి. వేప చెట్టు అద్భుత ఔషధ గని. ఈ వృక్షంలోని ప్రతి భాగంలో ఎన్నో ఔషధ గుణాలున్నాయి. అందువల్ల బహుముఖ ఔషధ చెట్టుగా గుర్తించబడింది. వేప ఉత్పత్తులు ఇటు మానవాళికి అటు వివిధ పంటల రక్షణకు దోహదమవుతున్నాయి. వేప ఉత్పత్తుల్ని సాగులో వాడితో సాగుఖర్చు ఆదా అవుతూ, ఆశించిన స్థాయిలో దిగుబడులు లభిస్తాయి.

కీటకాలు నాశనం

వేపలో అజాడిరాక్టిన్ అనే పదార్థం ఉంటుంది. దీనికి పలు రకాల కీటకాలు నల్లిజాతి పురుగులు, చెదలు, భూమిలోని నెమటోడ్స్, కొన్నిరకాల బూజు శిలీంద్రాల్ని అరికట్టే శక్తి ఉంటుంది. ఇది వరి, పత్తి, అపరాలు, కూరగాయలు, పండ్ల మొక్కలు, కాఫీ, జొన్న, ఉద్యాన పంటల్లో వచ్చే కీటకాల్ని అరికడుతుంది. మార్కెట్లో వేపపిండి, వేపనూనె, వేప కషాయం, వివిధ రకాల వేప ఉత్పత్తులు లభిస్తున్నాయి.

ఉత్పత్తులు.. పనిచేసే విధానం

నీమ్ ఆయిల్‌ను స్థానిక వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన మేరకు వాడితే కీటకాల పెరుగుదలను నిరోధిస్తుంది. దీన్ని పిచికారీ చేస్తే పురుగులకు వికారం కలిగించి పైరును తినకుండా చేస్తుంది. విషపూరిత అవశేషాలుండవు. ఇది పక్షులు, మానవులు, మిత్ర పురుగులు, తేనె టీగలు వంటి వాటికి హాని చేయదు. శీతాకోక చిలుకలు, తల్లి రెక్కల పురుగులు పెట్టిన గుడ్లు పొదగక ఎక్కువ శాతం చనిపోతాయి. సమగ్ర సస్యరక్షణ విధానంలో బాగా ఉపయుక్తమవుతుంది. పురుగు మందులు, శిలీంద్రనాశినులతో కలిపి సురక్షితంగా పిచికారీ చేసుకోవచ్చు. వేపరసం ద్వారా పురుగులు పైరును తినడానికి, రసం పీల్చడానికి ఇష్టపడవు. పురుగుల ప్రత్యుత్పత్తి దశలపై ప్రభావం చూపి తదుపరి దశలు ఎదగకుండా చేస్తుంది. వేపచెక్క వాడకంతో నులిపురుగుల సమస్యను తగ్గించవచ్చు. వేపనూనెను పిచికారీ చేయడం వల్ల పురుగులపై ప్రభావం చూపి వివిధ దశలు ఎదగకుండా చేస్తుంది. వేపనూనె ఇతర పురుగుమందులతో కలిపి వాడుకున్నప్పుడు మరింత ప్రభావంతంగా పనిచేస్తుంది.

ఇలా చేయాలి

పైరును పురుగు ఆశించిన వెంటనే పిచికారీ చేయాలి. తల్లి పురుగు గుడ్లు పెట్టినట్లు గమనించిన వెంటనే చేస్తే ఇంకా మంచిది. ఎకరాకు మూడు నుంచి ఐదు మిల్లీలీటర్ల నీమ్ ఆయిల్‌ను లీటరు నీటిలో కలిపి ఉదయం లేదా సాయంత్రం వేళల్లో పిచికారీ చేయాలి. పిచికారీ చేసిన తరువాత ఆరుగంటల వ్యవధిలోపు వర్షం పడితే మళ్లీ చేయాల్సిందే.

తెగుళ్ల నివారణ ఇలా..

వివిధ పంటల్లో వేప మందుల వాడకంతో పలు రకాల చీడపీడల్ని నివారించుకోవచ్చు. వరిపంటకు ఎకరాకు 150నుంచి 200కిలోల వేపపిండిని దమ్ములో వేయటం వల్ల కాండం తొలిచే పురుగు, ఉల్లికోడును అదుపు చేయవచ్చు. వరి పైరుపై లీటరు నీటికి మూడు మిల్లీలీటర్ల చొప్పున కలిపిన ద్రావణాన్ని ఎకరాకు 200 లీటర్ల చొప్పున పిచికారీ చేస్తే అగ్గితెగులు, తొడిమికుళ్లు, పొడ, వరితుంగ్రో వైరస్ తెగుళ్లను అదుపు చేయవచ్చు. ఐదుశాతం వేప గింజల కషాయం ఎకరాకు 200 లీటర్ల ద్రావణాన్ని మిర్చి పైరుపై పిచికారీ చేస్తే తెల్లదోమను అరికట్టవచ్చు. తద్వారా మిర్చి మీద వచ్చే జెమినీ వైరస్ తెగులు అదుపులో ఉంటుంది. వేరుశెనగ పైరును ఆశించి ఎక్కువగా నష్టపరిచే తిక్కాకుమచ్చ, టమాటోలో ఎండుతెగుళ్లను వేపనూనెతో నివారించవచ్చు.

జాగ్రత్తలు

- వేపనూనెను విడిగ పదేపదే వాడుకుంటే మొక్కల్లో ఎదుగుదల మందగిస్తుంది.
- మార్కెట్లో వేపనూనె మందులు వివిధ గాఢతలో లభిస్తాయి. అవి 300, 1500, 3వేలు, 10 వేలు పీపీఎంలో నాలుగు రకాలుగా లభిస్తాయి.
- గాఢతలను అనుసరించి తగిన మోతాదులో పంటలపై పిచికారీ చేసుకోవాలి.
- వేపకాయల కషాయాన్ని సంవత్సరంలోపే వాడుకోవాలి.

సేంద్రియ ఎరువుగా వేప ఉత్పత్తులు



వేపలో నత్రజని అధికంగా ఉంటుంది. వేప గింజల నూనె, వేపచెక్క, వేపకాయలు దంచితే వేపపిండి తయారవుతుంది. వేప ఉత్పత్తులను వాడి పొలాల్లో నేల ద్వారా వచ్చే తెగుళ్ల, చీడపీడలను నివారించుకోవడం ద్వారా రైతులు మంచి ఫలితాలు పొందవచ్చు. పంటకు అవసరమైన మేరకు మాత్రమే వేప ఉత్పత్తులను వాడుకోవాలి. సేకరించిన వేపకాయలు రైతులు ఒక సంవత్సరంలోపే వాడితే ప్రయోజనకరంగా ఉంటుంది. సేంద్రియ విధానానికి వేప ఎంతగానో ఉపయోగపడుతుంది. - డాక్టర్ ఫణి, సైంటిస్టు, ఏరువాక కేంద్రం, ఏలూరు

క్రీడా పోటీలకు ఎంపికైన కైకరం విద్యార్థులు



ఎంపికైన కైకరం హైస్కూలు క్రీడాకారులు

ఉంగుటూరు: మూడురోజులుగా కైకరం, నారాయణపురం, ఉంగుటూరులో నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ, కోకో, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, పోటీల్లో 80 మంది బాలబాలికలు ఎంపికయ్యారు. వీరందరినీ, వ్యాయామ ఉపాధ్యాయులు నాగసుధ, పాపాయమ్మను, హెచ్‌ఎం గళ్ల ప్రసాదరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ అల్లూరి జగదీశ్వరి, గ్రామపెద్దలు అభినందించారు.

కో ఆప్షన్ సభ్యులుగా మూడు నామినేషన్ల దాఖలు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థ పాలకవర్గంలో ఖాళీగా ఉన్న మూడు కో ఆప్షన్ సభ్యుల పదవులకు సంబంధించి అదనపు కమిషనర్ జి.చంద్రయ్యకు సోమవారం ముగ్గురి నుంచి నామినేషన్ పత్రాలు అందాయి. వీటిలో టీడీపీ అభ్యర్థులు మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, మాజీ కౌన్సిలర్ కొల్లేపల్లి రాజు, మాజీ కార్పొరేటర్ జాల సుమతి ఉన్నారు.